# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మొట్టమొదటి స్వదేశీ సెమీకండక్టర్ చిప్ ను ఈ సంవత్సరం విడుదల చేస్తామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ❖ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల నిర్మాణంలో విద్యార్థులు నాయకత్వం వహించాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునిచ్చారు.
- ❖ పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రేపు అఖిలపక్ష సమావేశం జరగనుంది.
- ❖ చిన్న రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ యువత మాదక ద్రవ్య రహిత భారతదేశంలో భాగం కావాలని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.

==============================

మొట్టమొదటి స్వదేశీ సెమీకండక్టర్ చిప్ ను ఈ సంవత్సరం విడుదల చేస్తామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఐఐటీ-హైదరాబాద్‌లో జరిగిన స్నాతకోత్సవంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ... దేశంలో ఆరు సెమీకండక్టర్ ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయని, ఈ రంగం భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ స్థానంలో నిలుపుతుందని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన సాంకేతిక వనరులు వేగంగా సిద్ధం అవుతున్నాయని చెప్పారు. సాంకేతిక-ఆధారిత భవిష్యత్‌కు అవసరమైన ప్రపంచ స్థాయి ఉత్పత్తులను భారత విద్యార్థులు ఆవిష్కరించాలని అశ్వినీ వైష్ణవ్ సూచిస్తూ.....

(వాయిస్ 33 సెకన్లు)

అలాగే దేశంలో మొదటి బుల్లెట్ రైలు 2027లో ప్రారంభమవుతుందని, చెన్నై కేంద్రంగా మూడవ తరం వందే భారత్ రైళ్లు సిద్ధమవుతున్నాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రవాణా, గృహ నిర్మాణం, వైద్య సదుపాయాలు, వ్యవసాయం వంటి రంగాల్లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడంలో విద్యార్థులు నాయకత్వం వహించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునిచ్చారు. ఈరోజు కేరళలోని ఐఐటీ పాలక్కాడ్ 7వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా నిలపే లక్ష్యాన్ని సాధించడంలో ప్రతి పౌరుడి కృషి, సహకారం ఉండాలన్నారు. సాంకేతిక స్వావలంబన ఆవశ్యకతను తెలియజేస్తూ... వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతను గుర్తించాలని చెప్పారు. ఐఐటీ పాలక్కాడ్ వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటును అందించడానికి కట్టుబడి ఉందన్నారు. ప్రపంచ డిజిటల్ రంగంలో భారతదేశ ప్రయాణాన్ని ధర్మేంద్ర ప్రధాన్ ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, రేపు అఖిలపక్ష సమావేశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పార్లమెంటు ఉభయ సభల సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారాన్ని ఈ సమావేశంలో ప్రభుత్వం కోరుతోంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే వర్షాకాల సమావేశాలు ఆగస్టు 21 వరకు కొనసాగనున్నాయి.
కాగా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.... పార్లమెంటులో సభ్యులు లేవనెత్తే ముఖ్యమైన అంశాలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జన్ విశ్వాస్ బిల్, నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్, మర్చంట్ షిప్పింగ్ బిల్లుతో సహా ముఖ్యమైన బిల్లులను చర్చించి ఆమోదించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చిన్న రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు ఆయన ఉత్తరాఖండ్ లోని రుద్రపూర్‌లో ప్రభుత్వం చేపట్టిన 1,271 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రుద్రపూర్‌లో నిర్వహించిన ఉత్తరాఖండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెస్టివల్ – 2025లో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడారు. చిన్న రాష్ట్రాలు పురోగమిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా ఆయే పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ప్రయోజనాలకు ఉపయుక్తంగా నిలిచే అంశాలపైనే భారత్ అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలను చేసుకుంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పునరుద్ఘాటించారు. వికసిత్ భారత్ ప్రయాణంలో ప్రపంచంపై ప్రభావాన్ని సృష్టించడం అనే అంశంపై ASSOCHAM ఈరోజు నిర్వహించిన ఒక సెషన్‌లో ఆయన ప్రసంగిస్తూ.... భారతదేశం ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. భారత్ 'యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్' (EFTA) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబర్ నుండి అమలులోకి

వస్తుందని తెలిపారు. గత ఏడాది మార్చి 10న ఈ ఒప్పందంపై ఇరు పక్షాలు సంతకాలు చేశాయని పియూష్‌గోయల్ వెల్లడించారు.

==============================

యువత మాదక ద్రవ్య రహిత భారతదేశంలో భాగం కావాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. వారణాసిలో ఈరోజు జరిగిన 'యూత్ స్పిరిచువల్ సమ్మిట్' ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పౌరులు దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మాదకద్రవ్య రహిత భారతదేశం ప్రచారానికి ముందుకు రావాలని కోరారు. ప్రతి పౌరుడు కనీసం ఐదుగురు యువకులను ఈ కార్యక్రమంతో అనుసంధానించడానికి ప్రతిజ్ఞ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తద్వారా 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను సాకారం చేయాలని మన్సుఖ్ మాండవీయ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

ఉత్తరప్రదేశ్‌లోని యమునా ఎక్స్‌ప్రెస్ వేపై ఈ రోజు తెల్లవారుజామున జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మరణించగా, 19 మంది గాయపడ్డారు. మథుర ఎస్పీ శ్లోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... మొదటి ప్రమాదం ఈ రోజు తెల్లవారుజామున 3 గంటలకు జరిగిందని, ఒక మినీవ్యాన్, ట్రక్కును ఢీ కొనడంతో 6 మరణించగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. మరొక ప్రమాదంలో ఉదయం 4 గంటలకు ఢిల్లీ నుండి మధ్యప్రదేశ్‌కు వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు బోల్తా పడి 17 మంది ప్రయాణికులు గాయపడ్డారని తెలిపారు.

==============================

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రముఖ టెక్ సంస్థలు గూగుల్, మెటాలకు నోటీసులు ఈరోజు జారీ చేసింది. ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి ఆ సంస్థ ప్రతినిధులు సోమవారం హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల పాత్రను ఈడీ పరిశీలిస్తోంది.

==============================

జమ్మూ కాశ్మీర్ పోలీసులు, కౌంటర్-ఇంటెలిజెన్స్ కాశ్మీర్ (CIK) విభాగం ఈరోజు కాశ్మీర్ లోని నాలుగు జిల్లాల్లో 10 చోట్ల సోదాలు నిర్వహిస్తోంది. జైషే మహ్మద్ సంస్థకు చెందిన ఉగ్రవాద కమాండర్ అబ్దుల్లా ఘాజీ సరిహద్దుల అవతల నుండి నిర్వహిస్తున్న ఉగ్రవాద స్లీపర్ సెల్స్, కార్యకలాపాలకు సంబంధించిన ఉగ్రవాద-నేర పరిశోధన కేసులో భాగంగా ఈ సోదాలు జరుగుతున్నాయని CIK అధికారులు తెలిపారు.

==============================

లండన్‌లోని లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ మహిళా జట్ల మధ్య జరుగుతున్న రెండో వన్డే మ్యాచ్‌లో టాస్ గెలిచి ఇంగ్లాండ్ బౌలింగ్ ఎంచుకుంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టానికి 50 పరుగులు చేసింది.

==============================

వాయువ్య రాజస్థాన్‌పై ఉన్న అల్పపీడనం బలహీనపడి అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. రానున్న రోజుల్లో నైరుతి రాజస్థాన్, ఉత్తర గుజరాత్‌లలో భారీ నుండి అతి

భారీ వర్షాలు కొనసాగుతాయని వెల్ల వెల్లడించింది. రేపు కేరళ, కర్ణాటక తీర ప్రాంతం, తమిళనాడులో వచ్చే వారం కూడా భారీ నుండి అతి భారీ వర్షపాతం కొనసాగుతుందని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =